వ్యాపారంలో తిరుగులేని 'భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్'



షేక్‌పేట్‌లోని వైష్ణవి ట్రేడర్స్ డీలర్ షాప్ వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న దృశ్యం

గోల్కొండ: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. షేక్‌పేట్‌లోని వైష్ణవి ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని పేర్కొన్నారు. ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ రూ. 20 అధికంగా ఉంటుందని తెలిపారు. డీలర్ కె.దయానంద్ మాట్లాడుతూ భారతీ సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ సాహేర్, సామ్రాట్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస రంగనాథ చార్యులు



శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి కల్యాణం

జియాగూడ: చారిత్రాత్మకమైన శ్రీ రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చేపట్టిన గరుడ ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. అంతకుముందు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనల అనంతరం గరుడ స్వామి పూజలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సంతానం లేని మహిళలు, వ్యాధిగ్రస్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని గరుడ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రతినిధి శేషాచారి, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస రంగనాథాచార్యులు, ఆలయ ట్రస్టీ ఎస్‌టీ చారి, బద్రినాథచార్యులు గరుడ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 1200లకు పైగా మహిళలు మహా ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. అలాగే సాయంత్రం రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

అసదుద్దీన్ ఓవైసీ విజయం సాధించాలని ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ, మహ్మద్ మొహినుద్దీన్

యాకుత్‌పురా: హైదరాబాద్ ఎంపీగా మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ మరోసారి భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ పార్టీ అమన్‌నగర్–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్ ఆధ్వర్యంలో తలాబ్‌కట్టా షా జాహన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా ముస్లిం మతపెద్దలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ప్రార్థనలకు హాజరైన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో హజ్ హౌస్ మసీదుకు చెందిన ఇమామ్ మౌలానా హాఫేజ్ సయ్యద్ షా అన్వరుల్లా ఖాద్రీ, మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, తలాబ్ చంచలం, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలలను సాహిత్యం వైపు ప్రోత్సహించాలి



బాల గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

సుల్తాన్‌బజార్: బాలలను పాఠ్యాంశాల అధ్యాయనంతో పాటు సాహిత్యం వైపు కూడా ప్రోత్సహించాలని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ కళామందిరం ఏర్పాటు చేసిన రెండురోజుల మాతృమూర్తి కొడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం బుధవారం ప్రారంభమైంది. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాంత – వసంత ట్రస్ట్ అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ కేఐ.వర ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించేందుకు సారస్వత పరిషత్‌కు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ. రమణాచారి, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రముఖ బాల సాహితీవేత్త జి.అశోక్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో బడిలో తెలుగు భాష, బాల సాహిత్యం – పత్రికలు, బాల సాహిత్య ప్రమాణాలు మొదలైన అంశాలపై సదస్సులు, చర్చా గోష్ఠిలు జరిగాయి. అనంతరం బాలల కోసం ప్రచురించిన బాలల సాహిత్య వైభవం, ఆరోగ్యం – విజ్ఞానం ఐదు సంపుటాల పిల్లల కథలను అతిథులు ఆవిష్కరించారు.

3 కిలోమీటర్లు..35 నిమిషాలు

నానల్‌నగర్–టోలిచౌకీ రోడ్డుపై ట్రాఫికర్'



నానల్‌నగర్–టోలిచౌకీ రోడ్డుపై నిలిచిన వాహనాలు

గోల్కొండ: మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ చౌరస్తా ట్రాఫికర్ నెలకొన్నది. 3 కిలోమీటర్లు కూడా లేని దూరం వెళ్లాలంటే కనీసం 35 నిమిషాలు రోడ్డుపైనే గడపాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మెహిదీపట్నం జి.పుల్లారెడ్డి డిగ్రీ కళాశాల నుంచి రేతిబౌలి చౌరస్తా వరకు భారీ వాహనాలు రోడ్డుపై బారులుతీరి ఉంటాయి. రేతిబౌలి చౌరస్తా నుంచి మెహిదీపట్నం వైపు వచ్చే వాహనాలు అత్తాపూర్ వైపు వెళ్తాయి. అదే సమయంలో అత్తాపూర్ నుంచి టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలోనే ఉంటాయి. రేతిబౌలి చౌరస్తా నుంచి నానల్‌నగర్ చౌరస్తా వరకు ప్రయాణం ఓ ఎత్తైతే నానల్‌నగర్ చౌరస్తా నుంచి టోలిచౌకీ చౌరస్తా వరకు ప్రయాణం మరో ఎత్తు. ఈ దారిలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది ఎక్కడ కనిపించారని వారు మండిపడుతున్నారు. మరో వైపు కొందరు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న కూడా బల్దియా అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది వాటివైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు అధికారుల సన్నద్ధం

- జూన్ 4న జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో లెక్కింపు
- ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి
- పక్కాగా ఈసీ గైడ్‌లైన్స్ అమలు
- రౌండ్ల వారీగా ఫలితాల నమోదు
- ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తర్వాతే ప్రకటన
- ఫైనల్ రిజల్ట్‌తోనే అభ్యర్థికి ఫారం–21ఈ అందజేత



మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఎఫ్‌ఏయూ కళాశాల

నాంపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్‌కు అధికారులు సన్నద్ధమవుతున్నారు. జూన్ 4న మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో లెక్కింపు జరగనుండగా ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం స్ట్రాంగ్‌రూంను సందర్శించి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ముగ్గురు ఏఆర్‌ఓలను ప్రభుత్వం నియమించింది. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగానే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటిస్తారు.

ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూం ఓపెన్..

జూన్ 4న ఉదయం 6 గంటలకు ఏజెంట్ల సమక్షంలో అధికారులు స్ట్రాంగ్ రూంను ఓపెన్ చేస్తారు. తఓట్ల లెక్కింపులో ఏమైనా సందేహాలు వస్తే ఆర్వోతో మాట్లాడి నివృత్తి చేసుకుంటారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లు ఎలా లెక్కించాలనే దానిపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు
ఏఆర్‌ఓ, లావణ్య 9440815856
ఏఆర్‌ఓ, నాగేశ్వరరావు 9652520634
ఏఆర్‌ఓ, జ్యోతి 9440815873

ఓటర్ల వివరాలు...
పురుషులు–1,66,335
మహిళలు–1,59,052
థర్డ్ జండర్–10
సర్వీసు ఓటర్లు–27

ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం..

ఈవీఎం మిషన్లను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తారు. వీరికి యూనిఫాం ఇస్తారు. నాంపల్లిలో 14 టేబుళ్లు ఉంటాయి. 20 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుంది. ఒక రౌండ్ పూర్తయ్యాకే మరో రౌండ్‌కు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకువస్తారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేవారికి ఐడీ కార్డులు తప్పనిసరి. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లను అనుమతించరు.

ఎన్‌కోర్‌లో నమోదు తర్వాతే..

ఓట్ల లెక్కింపులో భాగంగా స్ట్రాంగ్ రూంలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరిచిన ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్ రూంలో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఈవీఎంలో బ్యాటరీలు పనిచేయకపోతే వెంటనే మార్చి ఆన్ చేస్తారు.

ఓట్ల లెక్కింపు పూర్తికాగానే ఎన్‌కోర్‌లో నమోదు తర్వాతే ఫలితాలు వెల్లడిస్తారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఏఆర్‌ఓ, కంప్యూటర్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్ర పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు.

3వ తేదీకి కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి..

జూన్ 3వ తేదీ నాటికి కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలి. అక్కడే కేంద్ర పరిశీలకులతో పాటు కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్దే ఉండాలి. పక్క టేబుల్ వద్దకు వెళ్లరాదు. 14 టేబుళ్లకు 14 మంది ఏజెంట్లు ఉంటారు. ఒకసారి కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళితే తిరిగి లోనికి వచ్చే వీలుండదు.

నిజాయితీ చాటుకున్న వ్యక్తి



బాధితుడికి నగదు అందజేస్తున్న హోంగార్డు కృష్ణయ్య

సంతోష్‌నగర్: దొరికిన నగదును పోలీసుల సహాయంతో బాధితుడికి అందజేసి ఓ వ్యక్తి నిజాయితీ చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌లోని నగల దుకాణం వద్ద బుధవారం ఓ వ్యక్తి రూ.26 వేలు పడేసుకున్నాడు. ఇది గమనించిన మరొకరు ఆ డబ్బులను తీసుకుని సంతోష్‌నగర్ ట్రాఫిక్ హోంగార్డు కృష్ణయ్య సహాయంతో బాధితుడిని గుర్తించి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. దీంతో సదరు వ్యక్తిని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహా నాయక్ అభినందించారు.

వీడ్కోలు సభ



అబిడ్స్: ఆల్ ఇండియా రేడియో సీనియర్ టెక్నీషియన్ పిట్లం రవీందర్ ముదిరాజ్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు. అనంతరం పిట్లం రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 35 ఏళ్ల పాటు ఆల్ ఇండియా రేడియోలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ బల్‌రాం యాదవ్, జి.మల్లేశ్, కాశమోని శ్యామ్ రాజ్ ముదిరాజ్, లావణ్య, విజయలక్ష్మి, యోగా గురువు రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ్ రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

గౌలిపురా: పెట్రోల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బెరూన్ గౌలిపురాకు చెందిన సయ్యద్ జూబేర్ (38), అయేషా దంపతులు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. కాగా కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య అయేషా ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సయ్యద్ జూబేర్ ఈ నెల 28వ తేదీన రాత్రి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా గమనించిన కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించారు. అనంతరం బుధవారం మరోసారి సయ్యద్ జూబేర్ పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఈ ఘటనలో జూబేర్ 50 శాతం కాలిన గాయాలతో ఉస్మానియా ఆసుపత్రికి చికిత్స పొందుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగదుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ బోర్డులో సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్: వక్ఫ్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముఖ్తార్ హుస్సేన్ కోరారు. హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీ ఎండీ అజీజ్ పాషా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ.సిద్ధిఖీతో కలిసి మాట్లాడారు. జంట నగరాలు, జిల్లాల్లోని శ్మశానవాటికలు దాదాపు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. 20 కి.మీ దూరంలోని హైవేల వెంబడి 100 ఎకరాల వక్ఫ్ భూమిని కేటాయించాలని కోరారు. పట్టణాలు, జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఇండ్లు లేని ముస్లింలకు 100 చదరపు గజాల వక్ఫ్ భూమి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేసి వక్ఫ్ ఆస్తులను భూ కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి చెందిన రూ.5 లక్షల కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించి వక్ఫ్‌బోర్డుకు న్యాయపరమైన అధికారాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కమిషనరేట్ ఏర్పాటు, పర్మినెంట్ సీఈవో మైనార్టీల సంక్షేమంలో అవసరమైన ఉత్తర్వులు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌కె.రబ్బానీ, ఎండీ దస్తగిరి, ఎండీ, ఇలియాస్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గోల్కొండ: లంగర్‌హౌజ్‌లోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి మహిళలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లంగర్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, బీజేపీ నాయకుడు ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



మజ్లిస్ నాయకులు, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద మజ్లిస్ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండడంతో కొత్త పనులు ప్రారంభం కావడం లేదన్నారు. అనంతరం కార్వాన్ నుంచి వచ్చిన పలువురు ఎమ్మెల్యేను కలిశారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండీలైన్స్, తూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ వరద పైపులైన్ పనులు జరుగుతున్నాయని, వీటి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా ప్రాంతాల వారు తన దృష్టికి తెచ్చారన్నారు. వారం క్రితమే ఆయా ప్రాంతాల్లో పర్యటించి పనులు పరిశీలించానని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించానని పేర్కొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



యాదగిరిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

కాచిగూడ: ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బీడీఎల్ సంస్థలో 30 ఏళ్లపాటు పనిచేసి పదవీ విరమణ చేసిన యాదగిరి ముదిరాజ్‌ను బుధవారం ముదిరాజ్ సంఘం ప్రతినిధులు అభినందించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన శేష జీవితం కూడా ప్రజా సేవకు అంకితం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సామా పృథ్వీరాజ్ ముదిరాజ్, వాసు ముదిరాజ్, బాలకృష్ణ ముదిరాజ్, చంద్రశేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌కు సత్కారం



ప్రొఫెసర్ కోదండరామ్‌తో సమావేశమైన డాక్టర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్

అబిడ్స్: ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి డాక్టర్లు బుధవారం సత్కరించారు. ఉస్మానియా ఆసుపత్రికి వచ్చిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ ఎడిటర్ అమీర్‌అలీఖాన్‌ను ఉస్మానియా డెంటల్ కాలేజ్ ఆసుపత్రి ప్రొఫెసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్, కార్యదర్శి డాక్టర్ హరికృష్ణారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా డెంటల్ కళాశాల కొత్త భవనం నిర్మాణ విషయమై చర్చించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న బీజేపీ కన్వీనర్ సోమరాజ్ సింగ్

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని గోషామహాల్ బీజేపీ కన్వీనర్ సోమరాజ్ సింగ్ పేర్కొన్నారు. గోషామహాల్ పరిధిలోని సీతారామ్ పేట్‌లో స్థానికుల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ అధికారులతో బుధవారం ప్యాచ్‌వర్క్ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్‌ల సహకారంతో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాట్లు, ఇతర సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్టాన్లీ మహిళా కళాశాలలో ఫేర్‌వెల్ డే



వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ స్వరూపారాణి తదితరులు

అబిడ్స్: అబిడ్స్ చాపల్ రోడ్డులోని మహిళా కళాశాలలో యూజీ, పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్ డేను బుధవారం ప్రిన్సిపాల్ స్వరూపారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థినులను విద్య, సామాజిక, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో కూడా సత్తా చాటేలా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆట పాటలతో అలరించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో కొన్ని రోజులుగా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని కోట అధికారులు పేర్కొంటున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని బుకింగ్ కౌంటర్ వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎండను సైతం లెక్క చేయకుండా కోటలో కలియతిరుగుతూ అక్కడి చారిత్రక వస్తువులు, ప్రదేశాలను తిలకిస్తున్నారు. కోటలోని ప్రసిద్ధ ప్రాంతాల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబురపడుతున్నారు.

వ్యర్థాలను రోడ్లపై వేయద్దు



మసీదు పెద్దలు, ఇమామ్‌లతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ నాగదుర్గాప్రసాద్

గౌలిపురా: వ్యర్థాలను రోడ్లపై వేయకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బందికి అందజేయాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్టేషన్ పరిధిలోని మసీదు నిర్వాహకులు, ఇమామ్, మత పెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జూలై 7 నుంచి గోల్కొండ కోట బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల ఆషాఢ బోనాలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 7న ఆదివారం మొదటి పూజతో బోనాల ఉత్సవాలు ప్రారంభం కాగా ఆగస్టు 4వ తేదీన ముగుస్తాయని పేర్కొన్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు



కాచిగూడ: 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి జైలు జీవితం గడిపిన విద్యార్థి ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. అప్పటి ఉద్యమకారులు వయస్సు పై బడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా ఉద్యమకారులను ప్రభుత్వం సత్కరించనున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుల వివరాలతో కూడిన జాబితాను ఇప్పటికే ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఉద్యమకారులకు ఇళ్ల స్థలం, పింఛన్, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. 1969 ఉద్యమనేతల్లో ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, మిగిలిన వారిలో 45 మందితో కూడిన ఉద్యమకారుల లిస్టును సీఎంకు అందజేయనున్నట్లు తెలిపారు. అప్పటి ఉద్యమకారుల పేరుతో కొన్ని నకిలీ సంఘాలు పుట్టుకు వస్తున్నాయని అలాంటి వారి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 72 ఏళ్ల లోపు ఉన్నవారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, 72 ఏళ్ల పైబడి ఉన్నవారిని మాత్రమే ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు.